క్లుప్తంగా

98 మందికి వైద్య పరీక్షలు

హనుమంతునిపాడు: ఇంటింటికి ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవల కార్యక్రమంలో భాగంగా మంగళవారం ముప్పాళ్లపాడు సచివాలయ పరిధిలోని రామాయిపల్లిలో వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 98 మందికి వైద్య పరీక్షలు చేశారు. బీపీ, సుగర్, జలుబు, దగ్గు, జ్వరం, తదితర వ్యాధులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతకు రక్త పరీక్షలు, బీపీ సుగర్ పరీక్షలు చేశారు. వైద్య సిబ్బంది, 104 వాహన సిబ్బంది షేక్ మస్తాన్, డేవిడ్, ఎన్ఎంఎంఎల్‌హెచ్‌పీ,ఆశావర్కర్లు పాల్గొన్నారు.

దేవాలయాల్లో మొక్కల పెంపకంతో సుందరీకరణ



నారాయణస్వామి ఆలయంలో మొక్కలు నాటుతున్న చైర్మన్, సిబ్బంది

సీఎస్‌పురం(పామూరు): దేవాలయాల్లో మొక్కలు నాటి పెంచడం ద్వారా సుందరీకరణ చేపట్టినట్లు నారాయణస్వామి ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణ తెలిపారు. దేవాదాయశాఖ అధికారుల ఆదేశాలతో మంగళవారం నారాయణస్వామి ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చైర్మన్ చిన్న ఆదినారాయణ మొక్కలు నాటి ప్రారంభించారు. ఆలయ ప్రాంగణంలో పూర్తిస్థాయిలో మొక్కల పెంపకం చేపట్టనున్నట్లు తెలిపారు. ఆయన వెంట కొమ్మినేని వెంకట్రావు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రభుత్వ కళాశాలలో చేర్పించండి



పొన్నలూరులో కళాశాల కరపత్రాలతో ప్రచారం చేస్తున్న సిబ్బంది

పొన్నలూరు: మండలంలో పదో తరగతి పూర్తయిన విద్యార్థులను పొన్నలూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేర్పించాలని తల్లిదండ్రులను ప్రిన్సిపాల్ రాజేంద్రబాబు కోరారు. పొన్నలూరు, నాగిరెడ్డిపాలెం గ్రామాల్లో మంగళవారం కళాశాల సిబ్బంది అడ్మిషన్ల కోసం కరపత్రాలతో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ప్రభుత్వ కళాశాలలో నైతిక విలువలతో కూడిన విద్యను బోధిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు వేలకు వేలు ఫీజులు చెల్లించి కార్పొరేట్ కళాశాలల్లో కాకుండా నాణ్యమైన విద్యను బోధించే ప్రభుత్వ కళాశాలలో చేరాలన్నారు. పొన్నలూరులో కళాశాల స్థాపించింది మొదలు ఇక్కడ చదివిన విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని, పక్కా భవనంతో పాటు అన్ని రకాల వసతులు ఉన్నాయన్నారు. ప్రచార కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ వై.జాన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


అంగన్‌వాడీలో గ్రాడ్యుయేషన్ డే



ధ్రువీకరణ పత్రాలు అందుకున్న విద్యార్థులు

మర్రిపూడి: మండలంలోని గార్లపేట గ్రామంలోని ఓసీ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ కూచిపూడి సెక్టార్ సూపర్‌వైజర్ సుచరిత మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో కూడిన మెరుగైన విద్యనందిస్తున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రంలో విద్యాభ్యాసాన్ని పూర్తి చేసుకుని ఒకటో తరగతిలో చేరుతున్న విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందించారు. కార్యక్రమంలో ఐటీసీ వెంకటలక్ష్మి, ఉపాధ్యాయులు మధు, సురేంద్ర, అంగన్‌వాడీ కార్యకర్తలు వై.ఆదిలక్ష్మి, ఎ.కోటేశ్వరమ్మ, రాజేశ్వరి, మరియమ్మ,ఆయాలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



విద్యుత్ వెలుగుల్లో చెన్నకేశవస్వామి ఆలయం

జరుగుమల్లి(సింగరాయకొండ): జరుగుమల్లి మండలం దావగూడూరులో ప్రసిద్ధి చెందిన చెన్నకేశవస్వామి దేవస్థానంలో మంగళవారం నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. అంకురార్పణ, అగ్ని ప్రతిష్ఠతో ఉత్సవాలు ప్రారంభించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి డి.రజనీ కుమారి తెలిపారు. బుధవారం తెల్లవారుజామున 4 గంటలకు ధ్వజారోహణ, హోమాలు రాత్రి శేషవాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమిస్తారు. 20వ తేదీ రాత్రి హనుమంత సేవ, 21వ తేదీ రాత్రి గరుడసేవ, 22వ తేదీ గజవాహన సేవ, 23న కళ్యాణోత్సవం, 24న ఉదయం వసంతోత్సవం, రాత్రి అశ్వవాహన సేవ, ధ్వజారోహణ, 25న రాత్రి ఏకాంతసేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఈఓ వివరించారు. 19వ తేదీ నుంచి 24వ తేదీ వరకు సాయంత్రం 7 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

మాస్టర్‌ప్లాన్‌కు మోక్షమెప్పుడో..?



కందుకూరు పట్టణ వ్యూ

- పెండింగ్‌లో కందుకూరు మున్సిపాలిటీ నూతన మాస్టర్‌ప్లాన్
- పెరుగుతున్న జనాభా, విస్తీర్ణానికి అనుగుణంగా నూతన మాస్టర్‌ప్లాన్‌ను రూపొందించిన అధికారులు
- ప్రభుత్వం నుంచి ఆమోదం లేక నలుగుతున్న వైనం

కందుకూరు:

కందుకూరు మున్సిపాలిటీ నూతన బృహత్ ప్రణాళిక (మాస్టర్‌ప్లాన్) ఎప్పటి నుంచో అర్థం కావడం లేదు. దాదాపు రెండేళ్ల క్రితమే మాస్టర్‌ప్లాన్ డ్రాఫ్ట్ సిద్ధమైనా అనుమతులు రాక మూలనపడింది. వాస్తవానికి గతేడాది నుంచే అమలు కావాల్సిన మాస్టర్‌ప్లాన్, పలు సాంకేతిక కారణాలు, అధికారుల తప్పిదాలతో కొంత ఆలస్యమైంది. అయితే ఉన్నతాధికారుల సూచన మేరకు మార్పులు చేసి పంపినా ఇంకా అనుమతులు రాలేదని మున్సిపల్ అధికారుల వాదనగా ఉంది. దీంతో పెరిగిన పట్టణ జనాభాకు అనుగుణంగా మాస్టర్‌ప్లాన్ లేకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇంటి ప్లాన్ పొందాలన్నా, పారిశ్రామిక లైసెన్స్‌లు వంటి వాటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయితే ప్రస్తుతం నూతన ప్రభుత్వం ఏర్పడడంతో పెండింగ్‌లో మున్సిపల్ మాస్టర్ ప్లాన్‌కు ఎప్పుడు ఆమోదం లభిస్తుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది.

2005 నాటి మాస్టర్‌ప్లానే నేటికి అమల్లో

1987 వరకు గ్రామపంచాయతీగా ఉన్న కందుకూరును పరిసర గ్రామాలను కలిపి నగరపంచాయతీగా మార్చారు. ఆ తరువాత మున్సిపాలిటీగా రూపాంతరం చెందగా 1988లో మొదటిసారిగా మున్సిపాలిటీకి ఎన్నికలు జరిగాయి. 2001లో గ్రేడ్–2 మున్సిపాలిటీగా రూపాంతరం చెంది. తరువాత 2005లో కందుకూరు మున్సిపాలిటీకి సంబంధించి మాస్టర్‌ప్లాన్‌ను తయారు చేశారు. అప్పటి నుంచి నేటి వరకు అదే మాస్టర్‌ప్లాన్ అమల్లో ఉంది. అంటే దాదాపు 19 ఏళ్ల నుంచి అదే మాస్టర్‌ప్లాన్ అమలు చేస్తున్నారు. కానీ గడిచిన 19ఏళ్ల కాలంలో పట్టణంలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. పట్టణ జనాభా విపరీతంగా పెరడడంతో పాటు మున్సిపాలిటీ నుంచి తొలగించిన గ్రామాలు తిరిగి మున్సిపాలిటీ కలవడంతో విస్తీర్ణం కూడా పెరిగింది. కానీ మారిన పట్టణ అవసరాలకు అనుగుణంగా మాస్టర్‌ప్లాన్ మార్చకపోవడం వల్ల ప్రజలు పలు ఇబ్బందులు ఎదుర్కొంటూ వస్తున్నారు. పెరుగుతున్న జనాభాకు, పట్టణానికి అనుగుణంగా రోడ్ల విస్తీర్ణం లేకపోవడంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. అలాగే కొన్ని ప్రాంతాల్లో భవన నిర్మాణాలకు అధిక రుసుంలు వసూలు చేయాల్సి వస్తుంది. ప్రధానంగా పామూరు రోడ్డు కూడలి నుంచి కేజీబీవీ పాఠశాల వరకు ఉన్న పారిశ్రామిక జోన్‌గా మాస్టర్‌ప్లాన్‌లో నమోదై ఉంది. అప్పట్లో పొగాకు గ్రేడింగ్ కంపెనీలు అధికంగా ఉండడం వల్ల ఆ ప్రాంతాన్ని పారిశ్రామిక ప్రాంతంగా నమోదు చేశారు. కానీ వాస్తవానికి ఆ ప్రాంతంలో గుర్తించదగిన పెద్ద కంపెనీలు ఏమీ లేవు. కాల క్రమంలో ఈ ప్రాంతంలో నివాసాలు భారీగా పెరిగి పట్టణ ప్రాంతం పెరుగుతూ పోయింది. అయినా సరే మాస్టర్‌ప్లాన్ ప్రకారం ఆ ప్రాంతం పారిశ్రామిక జోన్‌గా ఉండడంతో ఇంటి నిర్మాణానికి మున్సిపల్ అధికారులు అనుమతులు ఇవ్వడం లేదు. దీంతో అనధికారికంగానే ప్రజలు ఇళ్లు నిర్మించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. అలాగే కేసరిగుంటకాలనీలో ప్రస్తుతం భారీ భవనాలు నిర్మితమయ్యాయి. పెద్ద సంఖ్యలో నివాసాలు అక్కడ ఏర్పాటయ్యాయి. కానీ ఆప్రాంతం కూడా ఇంకా కుంట భూమిగానే మాస్టర్‌ప్లాన్‌లో ఉంది. దీని వల్ల ఇంటి నిర్మాణ అనుమతులు రాకపోవడంతో పాటు, బ్యాంకుల్లో రుణాలు పొందాలన్నా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనిగిరి రోడ్డు, తానికొండవారి కొష్టాలు తదితర ప్రాంతాల్లో పాత మాస్టర్‌ప్లాన్ ప్రకారం ఇబ్బందులు తప్పడం లేదు. ఇలాంటి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని, భవిష్యత్ అవసరాలను తీర్చే విధంగా జియోగ్రాఫికల్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఆధారంగా డిజైన్ ప్లానింగ్ కౌన్సిల్ సహకారంతో నూతన మాస్టర్‌ప్లాన్‌ను అధికారులు తయారు చేశారు.

నూతన మాస్టర్ ప్లాన్ ఇలా

ప్రస్తుతం రూపొందించిన నూతన మాస్టర్ ప్లాన్ ప్రకారం కందుకూరు మున్సిపాలిటీ విస్తీర్ణం 60.32 చ.కి.మీ. మొత్తం 7151హెక్టార్‌ల విస్తీర్ణం ఉంటుంది. మొత్తం విస్తీర్ణాన్ని ఏపీ మెట్రోపాలిటన్ రీజియన్, పట్టణాభివృద్ధి సంస్థ నిబంధనల ప్రకారం గృహ, వాణిజ్య, పబ్లిక్ తదితర అవరాలకు అనుగుణంగా కేటాయిస్తూ మాస్టర్‌ప్లాన్‌ను తయారు చేశారు. ఈ మాస్టర్‌ప్లాన్‌ను 2041 వరకు ఉండే విధంగా మార్పులు చేశారు. నూతన ప్లాన్ ప్రకారం గతంలో పామూరు రోడ్డులో ఉన్న పారిశ్రామిక జోన్‌ను ఆనందాపురం రోడ్డుకు, గ్రీన్ జోన్‌ను చాకలికుంట సమీపంలోకి మార్చినట్లు తెలుస్తుంది. కేసరిగుంట కాలనీ ప్రైవేట్ భూమిగా నమోదు చేశారు. అలాగే పట్టణం చుట్టూ జాతీయ రహదారి, బైపాస్ ఉండేలా రూపొందించారు. కోవూరు రోడ్డు, వెంకటాద్రిపాలెం, విక్కిరాలపేట, మహాదేవపురం, అనందాపురం,చుట్టుగుంట, దివివారిపాలెం గ్రామాలకు వెళ్లే రోడ్లను 80అడుగుల రోడ్డుగా మార్చారు. అలాగే పట్టణంలోని పలు ప్రధాన రోడ్లు అయిన కనిగిరి, పామూరు, గుడ్లూరు, ఓవీ రోడ్లను 100 అడుగులు ఉన్నట్లు, పలు జంక్షన్‌లు, పార్కులు వంటివి నమోదు చేశారు. అలాగే కాలనీల్లోని అంతర్గత రోడ్లు, పలు చిన్న, చిన్న రోడ్లను కనీసం 30 అడుగులు ఉండేలా మార్పులు, చేర్పులు చేశారు. ఈ ప్లాన్ అమల్లోకి వచ్చిన తరువాత దానికి అనుగుణంగా అనుమతులు ఇవ్వనున్నారు. వాస్తవానికి గత ఏడాది జనవరి నాటికే మాస్టర్‌ప్లాన్ ఆమోదం పొందాల్సి ఉంది. అయితే పలు సాంకేతిక కారణాలతో తిరిగి మార్పులు చేయాలని ఉన్నతాధికారులు మున్సిపల్ అధికారులకు సూచించారు. ఆ తరువాత మార్పులు, చేర్పులు చేసి పంపినా ఉన్నతాధికారుల నుంచి స్పందన లేకపోవడంతో పెండింగ్ ఉండిపోయింది. ఆ తరువాత ఎన్నికల రావడంతో దీని గురించి పట్టించుకునే వారు కరువయ్యారు. ప్రస్తుతం నూతన ప్రభుత్వంలో ఎన్నికైన ప్రజాప్రతినిధులు దీనిపై దృష్టి పెట్టి నూతన మాస్టర్‌ప్లాన్‌ను అమల్లోకి తీసుకురావాలని ప్రజలు కోరుకుంటున్నారు..

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న జడ్జీ భరత్ చంద్ర

కనిగిరి రూరల్: ఈనెల 29న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కనిగిరి జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ కె.భరత్‌చంద్ర అన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో మంగళవారం పోలీస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సమావేశంలో జడ్జి మాట్లాడుతూ రాజీ మార్గమే రాజమార్గమని, కక్షిదారులు రాజీ మార్గం ద్వారా కేసులు పరిష్కరించుకునేటట్లు చూడాలని పోలీస్ అధికారులకు తెలిపారు. ప్రజలకు సత్వర న్యాయం అందించేందుకు న్యాయశాఖ కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగానే లోక్ అదాలత్‌లను నిర్వహించి కేసులను పరిష్కరిస్తున్నట్లు వెల్లడించారు. వాది, ప్రతి వాదులు కాలయాపన చేయకుండా రాజీ ద్వారా కేసులు పరిష్కరించుకోవాలని సూచించారు. కోర్టు కేసుల పెండింగ్ సమస్యకు లోక్ అదాలత్ పరిష్కార మార్గమన్నారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల్లో ఎక్కువ శాతం క్రిమినల్ కేసులేనని, వాటిలో రాజీ పడదగిన క్రిమినల్ కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. జాతీయ లోక్ అదాలత్‌ను అందరూ సద్వినియోగం చేసుకొని కేసులను పరిష్కరించుకునేలా పోలీస్ శాఖ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కనిగిరి డీఎస్పీ రత్నాకరం రామరాజు, సీఐ, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్ భవనం పరిశీలన



అన్నక్యాంటీన్ భవనాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ కృష్ణారెడ్డి

కందుకూరు: ప్రభుత్వ ఆదేశాలతో పట్టణంలో అన్నా క్యాంటీన్ ఏర్పాటుకు అధికారులు చర్యలు ప్రారంభించారు. దీనిలో భాగంగా పట్టణంలోని మార్కెట్ సెంటర్‌లో ఉన్న భవనాన్ని మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి మంగళవారం పరిశీలించారు. గతంలో ఇదే భవనంలో అన్న క్యాంటీన్ నిర్వహించామని, మరోసారి ఇక్కడే అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. త్వరలోనే అన్న క్యాంటీన్ ప్రారంభానికి చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

క్షతగాత్రునికి వైఎస్సార్ సీపీ నాయకుల పరామర్శ



క్షతగాత్రుని పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని కోవిలంపాడు గ్రామానికి చెందిన పారిశుద్ధ్య కార్మికుడు గొల్లపల్లి యోహాన్ ఇటీవల ప్రమాదానికి గురయి కాలు విరిగింది. ఈ సంద్భంగా మంగళవారం యోహాన్‌ను వైఎస్సార్ సీపీ మైనారిటీసెల్ రాష్ట్ర కార్యదర్శి షేక్.బుజ్జి, పలువురు నాయకులు పరామర్శించి ఆర్థికసాయం చేశారు. కార్యక్రమంలో బలబద్ర ప్రభాకర్, నేదురుపల్లి రాజారత్నం, బి.ఆనందయ్య, చిన్నబ్బాయ్, మేక రవి, పలువురు పాల్గొన్నారు.

పీఎం కిసాన్ నిధుల విడుదల



విత్తనాల కిట్ అందజేస్తున్న ఏడిఏ అనసూయ

కందుకూరు: పీఎం కిసాన్ 17వ విడత నిధులు రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు ఏడీఏ అనసూయ తెలిపారు. పీఎం కిసాన్ నిధుల విడుదల సందర్భంగా మంగళవారం మండలంలోని ఓగూరు గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రతి నాలుగు నెలలకి ఒకసారి చొప్పున ఏడాదికి మూడు విడతల్లో నేరుగా పీఎం కిసాన్ నిధులు రైతుల ఖాతాల్లో జమవుతాయని తెలిపారు.

ప్రస్తుతం 17వ విడత కింద రూ.2000 చొప్పున నిధులను కేంద్రం విడుదల చేసిందని చెప్పారు. ఎవరికైనా నిధులు జమకాని పక్షంలో సంబంధిత గ్రామ వ్యవసాయ సహాయకులను ఆధార్, పట్టాదారు పాస్‌పుస్తకాలతో సంప్రదించి పీఎం కిసాన్ పోర్టల్‌లో పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. వ్యవసాయాధికారి వి.రాము మాట్లాడుతూ మండలానికి 251 క్వింటాళ్ల జనుము, 34క్వింటాళ్ల పిల్లిపెసర విత్తనాలు మంజూరయ్యాయని చెప్పారు. భూమిలో పదును శాతాన్ని బట్టి విత్తుకోవాలని కోరారు. ప్రకృతి వ్యవసాయ మండల రిసోర్స్ అధికారి డి.ధనమ్మ మాట్లాడుతూ 21 రకాల విత్తనాల కిట్ పొలంలో వేసుకుని 40 రోజుల తరువాత దున్నుకుంటే భూమికి మంచి పోషకాలు అంది దిగుబడులు బాగా వస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా 21 విత్తనాల కిట్, జనుము విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. గ్రామ వ్యవసాయ సహాయకులు కె.శరత్‌కుమార్, పశు సంవర్ధక సహాయకులు షేక్ షాజహాన్, ప్రకృతి వ్యవసాయ క్షేత్రస్థాయి డివిజనల్ మోడల్ మేకర్స్ పిడికిటి మాధవ, చల్లా రాజ, ఎంపీటీసీ అల్లం రాధయ్య తదితరులు పాల్గొన్నారు.

50 శాతం రాయితీపై విత్తనాల పంపిణీ

పీసీపల్లి: రైతులకు 50 శాతం రాయితీపై పచ్చిరొట్టవిత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు ఏఓ వెంకటస్వామి తెలిపారు. మంగళవారం ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధులు పంపిణీ కార్యక్రమాన్ని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ప్రత్యక్ష ప్రసారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ అన్ని రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని, 50 శాతం రాయితీపై వీటిని రైతులకు అందిస్తామన్నారు. ఏఈఓ పుల్లయ్య, వీఏఏ కళ్యాణ్, పంచాయతీ కార్యదర్శి కిరణ్, రైతులు పాల్గొన్నారు.


350 మందికి ఉచిత వైద్య పరీక్షలు



రామదూత ఆశ్రమంలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

గుడ్లూరు: మండలంలోని చేవూరు వద్ద ఉన్న రామదూత ఆశ్రమంలో రామదూత స్వామి జన్మదినం సందర్భంగా నెల్లూరు నారాయణ సూపర్ స్పెషాలిటీ వైద్యశాల ఆధ్వర్యంలో వైద్యశాల ఏజీఎం శేఖర్‌రెడ్డి పర్యవేక్షణలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 350 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ఆశ్రమ నిర్వాహకులు శ్రీనివాసరావు, చౌదరిలు తెలిపారు. వైద్యశాలకు చెందిన డాక్టర్లు గుండె సంబంధిత వ్యాధులకు, కీళ్లు, ఎముకలకు, సాధారణ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందచేశారు. కంటి పరీక్షలు నిర్వహించారు. 50 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. అలాగే 80 మంది యువకులు రెడ్‌క్రాస్‌కు రక్తదానం చేశారు. 300 మంది వృద్ధులకు వస్త్రాలు దానం చేశారు. ఆశ్రమంలో ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. ఏజీఎం శేఖర్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ప్రజలకు వైద్యసేవలు అందించడానికి రామదూత ఆశ్రమంలో త్వరలో హెల్త్ క్లినిక్ ఏర్పాటు చేస్తున్నామన్నారు.

రైల్వేలైన్ పనుల పరిశీలన



రైల్వేలైన్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర

కనిగిరి రూరల్: మండలంలోని కలగట్ల గ్రామం వద్ద జరుగుతున్న నడికుడి –కాళహస్తి రైల్వే మార్గం పనులను మంగళవారం ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉగ్ర రైల్వే శాఖ అధికారులతో మాట్లాడారు. రైల్వేలైన్, స్టేషన్ నిర్మాణం పనులు తదితర అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. పనులు వేగవంతంగా చేపట్టేందుకు తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తమ్మినేని శ్రీనివాసులరెడ్డి, రాచమల్ల శ్రీనివాసులరెడ్డి, ఎస్కే జంషీర్‌అహ్మద్, తమ్మినేని వెంకటరెడ్డి, ఎస్కే ఖాదర్, ఎస్కే బారాయిమామ్, మాజీ ఎంపీపీ నంబుల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థి కిట్లు పంపిణీ



పాఠశాల హెచ్ఎంలకు విద్యార్థి కిట్‌లను అందజేస్తున్న ఎంఈఓ సుబ్బారావు

పామూరు: ప్రభుత్వం అందిస్తున్న విద్యార్థి కిట్లు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు వరం లాంటివని ఎంఈఓ డీవీ సుబ్బారావు అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల కోసం ప్రభుత్వం సమకూర్చిన విద్యార్థి కిట్‌లను స్థానిక ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో ఎంఈఓ సుబ్బారావు పాఠశాలల హెచ్ఎంలకు అందజేసి ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు పంపిణీ చేస్తున్నామన్నారు. బ్యాగులు, బెల్టులు మండల కేంద్రానికి వచ్చాయని యూనిఫాం, బూట్లు రాగానే పూర్తిస్థాయి విద్యార్థి కిట్లు విద్యార్థులకు అందిస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా వసతులు ఉన్నాయని, విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. హెచ్ఎంలు రామస్వామి, సయ్యద్ ఇసాక్, ఎమ్మార్సీ సిబ్బంది రవి, సీఆర్‌పీలు, ఎంఐఎస్ కో ఆర్డినేటర్ విజయభాస్కర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ విద్య



సి.నాగులవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న జెడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయులు

సీఎస్‌పురం(పామూరు): ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో అన్ని వసతులతో కూడిన, అన్ని రకాల కార్పొరేట్ విద్య అందిస్తామని సి.నాగులవరం జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం మందా కుమారి అన్నారు. × నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా మంగళవారం నాగులవరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఉః మందా కుమారి, ఉపాధ్యాయులు సి.నాగులవరం ప్రాథమిక పాఠశాల, కంభంపాడు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల పరిధిలో ఇంటింటా, పాఠశాలల్లో క్యాంపెయినింగ్ చేసి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని కోరారు. ఈ సందర్భంగా గత ఏడాది 10వ తరగతిలో వచ్చిన మార్కుల వివరాలు ప్రచార పత్రాలను పంపిణీచేశారు. పాఠశాలలో ప్రభుత్వం విద్యార్థులకు సమకూర్చే పాఠ్యపుస్తకాలు యూనిఫాం, మధ్యాహ్నభోజన మెనూ, డిజిటల్ విద్య వివరాలను వివరించారు. హెచ్ఎం జి.శ్రీనివాస రాజు, ఎ.సంజీవరాణి, జవంగుల వెంకట్రావు, రియాజ్, హస్తి వీరాంజనేయులు, మానం శ్రీనివాసులు, బి.వి.ఎస్.రమేష్, రామకృష్ణ, నాయబ్‌రసూల్, చాంద్‌బేగం, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



మందులు పంపిణీ చేస్తున్న డాక్టర్ బత్తుల బాలకృష్ణ, సర్పంచ్ నాగార్జునరెడ్డి

కనిగిరి రూరల్: ఉచిత పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ చిలంకూరి నాగార్జున రెడ్డి అన్నారు. మండలంలోని మందాది వారిపల్లిలో రిలియన్స్ ఫౌండేషన్, సార్డ్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బత్తుల బాలకృష్ణా మాట్లాడుతూ పాడి రైతులు ఇలాంటి అవకాశాలను ఉపయోగించుకోవాలన్నారు. ప్రస్తుతం సీజనల్ పశువులకు, మూగ జీవాలకు వచ్చే సీజనల్‌వ్యాధులు నివారణ చర్యలు, ముందస్తు జాగ్రత్త చర్యల గురించి వివరించారు. పాడి రైతులకు వ్యాధులపై అవగాహన కల్పించారు. 120 జీవాలకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సంస్థల ప్రతినిధులు వాసు, విజయ్, రామయ్య, పాడి రైతులు పాల్గొన్నారు.